క్లుప్తంగా

నారాయణరావుకు ఘన నివాళి



మొకర నారాయణరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాగవంశీయులు

భీమునిపట్నం : భీమిలి ప్రాంతంలోని నాగవంశీయుల కుల పెద్ద, వుడా మాజీ డైరెక్టర్ మొకర నారాయణరావు వర్ధంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగవంశ కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమస్యల పరిష్కారానికి నారాయణరావు ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. కె.ముత్యాలరావు, కంటుభుక్త రామానాయుడు, గాడు సన్యాసినాయుడు, సంకుభుక్త జోగారావు, కంటుభుక్త శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెరువు స్థలం ఆక్రమణపై ఆందోళన



ఆక్రమణ పనులు అడ్డుకున్న స్థానికులు

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ రెవెన్యూ కల్లివానిపాలెం వద్ద చెరువు స్థలాన్ని ఓ ప్రైవేటు లే అవుట్‌కు చెందిన వారు శనివారం చదును చేసేందుకు పొక్లెయిన్ ఏర్పాటు చేయడంతో స్థానికులు అడ్డుకున్నారు. ఇక్కడి చెరువు తవ్వుతున్న సమయంలో స్థానికులు పెద్ద ఎత్తున చేరుకుని, పనులు అడ్డుకుని ఆందోళనకు దిగారు. చెరువును మూసేస్తే భవిష్యత్‌లో వరద నీరు ప్రవహించక ఊరు మునిగిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఇక్కడ సర్వే నిర్వహించి అధికారులు తమ చెరువును పరిరక్షించాలని డిమాండ్ చేశారు. లే అవుట్ ప్రతినిధులు అక్కడకు చేరుకుని పనులు నిలిపి వేస్తామని చెప్పడంతో స్థానికులు వెనుదిగారు.

శిల్పారామంలో నృత్య ప్రదర్శన నేడు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం జాతరలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు నగరంలోని శ్యామల కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన ఉంటుందని స్థానిక పరిపాలన అధికారి టి.విశ్వనాథ రెడ్డి తెలిపారు. ఆసక్తి గల వారు తరలిరావాలని కోరారు.

సేవా కార్యక్రమాలతో వైఎస్సార్ జయంతి



జ్యూట్‌మిల్లు కల్యాణ మండపంలో సమావేశమైన వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస : మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకలను ఈ నెల 8న సేవా కార్యక్రమాలతో చేపట్టనున్నట్లు జీవీఎంసీ ఒకటో వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్ తెలిపారు. చిట్టివలస జ్యూట్‌మిల్లు కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం నిర్వహించే కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు అక్కరమాని చినబాబు, చింతగుంట శివ, గిడుతూరి వెంకటరావు, సిమ్మల ప్రసన్న, తమ్మిన నరసింగరావు, వెంపాడ వెంకటరమణ, దుంప సాయిరెడ్డి, దేవిని విజయసారథి, గిడుతూరి మురళి, లెంక రమేష్ పాల్గొన్నారు.

◆ ఈ నెల 8న భీమిలి మండలం టి.నగరపాలెం వద్ద ఉదయం 10 గంటలకు వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకల్లో వైఎస్సార్ సీపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను కోరారు. సేవా కార్యక్రమాల ద్వారా పార్టీ బలోపేతానికి నాంది పలకాలని కోరారు.

ఆధునికంగా జూనియర్ కళాశాల

- రూ.1.29 కోట్లతో గత ప్రభుత్వంలో అభివృద్ధి
- డిజిటల్ బోర్డులు, ప్రత్యేక లేబొరేటరీల ఏర్పాటు
- జూలై 31 వరకు ప్రవేశాలకు అవకాశం



కొత్తగా ఏర్పాటు చేసిన బెంచీలపై విద్యార్థులు



భీమిలిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల



విద్యార్థులకు తాగునీటి కోసం ఆర్‌వో ప్లాంట్

భీమునిపట్నం : భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రైవేటు కాలేజీల కంటే మెరుగ్గా వసతులు కల్పించి ఆధునికంగా తీర్చిదిద్దారు. ఇక్కడ గతంలో సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉండేవి. ఈ క్రమంలో గత ప్రభుత్వంలో మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రూ.1.29 కోట్లు మంజూరు చేయించారు. దీంతో అన్ని తరగతి గదులను డిజిటల్ క్లాస్ రూమ్‌లుగా ఆధునికీకరించారు. కొత్త బెంచీలు, ఫ్యాన్‌లు ఏర్పాటు చేశారు. స్వచ్ఛమైన తాగునీరు అందివ్వడానికి రెండు ఆర్‌వో ప్లాంట్లు, విద్యార్థినీ విద్యార్థులకు వేర్వేరుగా మరుగుదొడ్లు నిర్మించారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీకి సంబంధించి లేబొరేటరీలు కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో ఇక్కడి జూనియర్ కళాశాల ప్రైవేటు కాలేజీకి ఏమాత్రం తీసిపోనివిధంగా తయారైంది. ముఖ్యంగా ఇక్కడ అన్ని సబ్జెక్ట్‌లు బోధించడానికి 25 మంది అధ్యాపకులు అందుబాటులో ఉన్నారు. వీరు చక్కగా బోధించడంతో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు.

31 వరకు ప్రవేశాలకు అవకాశం

ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్‌లో కొత్తగా చేరాలనుకుంటే ప్రవేశాలకు జూలై 31 వరకు అవకాశం కల్పిస్తున్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులు నిర్వహిస్తున్నారు. గ్రూప్‌నకు 44 సీట్లు కేటాయించారు. ఇవేకాకుండా ఆరు వృత్తి విద్య కోర్సులు నిర్వహిస్తున్నారు. వాటిలో అకౌంట్స్ అండ్ ట్యాక్సేషన్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఫిమేల్), ఆఫీస్ అసిస్టెంట్‌షిప్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రతీ కోర్సుకు 40 సీట్లు కేటాయించారు. ఇప్పటి వరకు అన్ని కోర్సుల్లోనూ సగం కంటే ఎక్కువ సీట్లు భర్తీ అయ్యాయి. మిగిలిన సీట్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అనుభవమున్న అధ్యాపకులతోపాటు మంచి సదుపాయాలు కల్పించడంతో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు కూడా ఆసక్తి చూపుతున్నారు.



కళాశాలలో డిజిటల్ బోర్డుపై బోధిస్తున్న ఉపాధ్యాయుడు

ప్రత్యేక శ్రద్ధతో బోధన



కళాశాలలో అందుబాటులో ఉండే అధ్యాపకులంతా ఎంతో అనుభవమున్న వారు కావడంతో ఆయా సబ్జెక్టుల్లో ప్రత్యేక శ్రద్ధతో బోధిస్తున్నారు. అందువల్లే గత ఏడాది ఎక్కువ మంది విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. వసతులు కూడా మెరుగ్గా వుండడంతో విద్యార్థులంతా సమస్యలు లేకుండా చక్కగా చదువుకునే అవకాశం వుంది.

– సీహెచ్ సూర్యప్రసాద్, ప్రిన్సిపాల్

ఉచిత వైద్య శిబిరం నేడు

తగరపువలస : ఆనందపురం మండలం లొడగలవానిపాలెం జాతీయ రహదారిని ఆనుకుని ఆంజనేయస్వామి గుడి ఎదురుగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఉమా నారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే శిబిరంలో వ్యాధి నిర్ధారణ పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయనున్నారు. వివరాలకు 99081 18050, 96035 63579లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

ప్రభుత్వ స్థలం స్వాధీనం



ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట సర్వే నంబరు 314లోని ప్రభుత్వ స్థలంలో అనధికారిక నిర్మాణాలను తహసీల్దార్ టి.గోవింద ఆదేశాల మేరకు శనివారం తొలగించారు. ఇక్కడ జరుగుతున్న అనధికార నిర్మాణాలపై వరుస ఫిర్యాదుల మేరకు ఆక్రమణలు తొలగించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి స్థలం స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ టి.గోవింద తెలిపారు. ఇకపై ఎవరైనా ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ఇక్కడ ఆక్రమణలు, అనధికార నిర్మాణాలపై నిఘా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

బోధనలో నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి

- విద్యాశాఖ ఆర్జేడీ విజయ భాస్కర్



మాట్లాడుతున్న ఆర్జేడీ విజయ భాస్కర్

విశాఖ విద్య: బోధనలో నైపుణ్యాలు మెరుగుపర్చుకొని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో చదువులు చెప్పాలని విద్యాశాఖ ఆర్జేడీ బి. విజయ భాస్కర్ అన్నారు. గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో జిల్లాలోని గణితం బోధించే ఉపాధ్యాయులకు శనివారం వృత్తి నైపుణ్య శిక్షణ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్జేడీ విజయ భాస్కర్ మాట్లాడుతూ గణతం అంటే విద్యార్థుల్లో లేనిపోని భయం ఉందని, ఇదో కష్టమైన సబ్జెక్టుగా భావిస్తున్నారన్నారు. కానీ సబ్జెక్టులో పట్టుసాధిస్తే,గణితమే సులభమన్నారు. దీనిలోనే ఎక్కువ మార్కులు కూడా సాధించవచ్చన్నారు. సబ్జెక్టుపై పట్టుసాధించి బోధనలో మెలకువలను తెలుసుకొని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. డీఈవో ఎల్. చంద్రకళ మాట్లాడుతూ సబ్జెక్టులో వెనుకబడిన విద్యార్థులను ముందుగా గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సంవత్సరం పదో తరగతి వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రతీ ఉపాధ్యాయుడు శ్రద్ధ చూపాలన్నారు. ఈ సందర్భంగా జాతీయ గణిత పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థుల తరఫున ఆయా పాఠశాలల గణిత ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం వై. వేణుగోపాల్, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ వినతులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరావు

పద్మనాభం : పీజీఆర్ఎస్‌లో వచ్చే వినతులను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ ఎస్.వెంకటరావు ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఉన్న ప్రభుత్వ భూములను గ్రామాలవారీగా గుర్తించాలన్నారు. మ్యుటేషన్ కోసం వచ్చే దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు.

234 మందికి కంటి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం : భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్ద నున్న సన్ స్కూల్ సమీపంలో శనివారం భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్, గంటా శారద హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా పేదలకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కైతపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏటా మూడు శిబిరాలు నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం 234 మందికి పరీక్షలు నిర్వహించారని తెలిపారు. విశాఖ శంకర్ ఫౌండేషన్ నుంచి డాక్టర్ సుచిత్ర, సిబ్బంది తరలివచ్చి పరీక్షలు నిర్వహించారని తెలిపారు. శిబిరంలో 45 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారని, వీరికి త్వరలోనే ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. అవసరమైన వారికి కంటి అద్దాలు త్వరలోనే అందిస్తామని వెల్లడించారు. సేవా సంస్థల సభ్యులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

వారాహి నవరాత్రులు ప్రారంభం



వారాహి అమ్మవారి మాలలు ధరించిన భక్తులు



వారాహి అమ్మవారికి అర్చన చేస్తున్న అర్చకులు కల్యాణ చక్రవర్తి

తగరపువలస : భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ కీతిన్‌పేటలోని శ్రీవిద్య శక్తిపీఠంలో శనివారం నుంచి శ్రీవారాహి అమ్మవారి నవరాత్రులు ప్రారంభమయ్యాయి. ఈ నెల 15 వరకు వీటిని నిర్వహించనున్నట్లు అర్చకుడు సోమయాజుల కల్యాణ చక్రవర్తి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు అమ్మవారి మాలలు ధరించి దీక్షలు చేపట్టారు. ఉదయం, సాయంత్రం వేళల్లో అమ్మవారికి అర్చనలు, హోమాలు నిర్వహించనున్నారు. ఈ సందరభంగా కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ వారాహి అమ్మవారు శక్తి స్వరూపాలలో, సప్త మాతృకలలో, దశ మహావిద్యలలో ఒకరైన అమ్మవారు లలితాదేవికి సైన్యాధిపతిగా వ్యవహరిస్తారన్నారు. ఆమెను ఆరాధిస్తే జీవితంలో ఎదురయ్యే అడ్డంకులు తొలగిపోవడంతోపాటు శత్రుభయం పోతుందని, అపారజ్ఞానం సిద్ధిస్తుందన్నారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



సమావేశంలో ఆర్డీవో భాస్కరరెడ్డి, ఇతర శాఖల అధికారులు

తగరపువలస : లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, దీనిపై విద్యా సంస్థల్లో తరచూ అవగాహన సదస్సులు నిర్వహించాలని భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి సూచించారు. భీమిలిలోని ఆయన కార్యాలయంలో ఆరోగ్య సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవగాహన సదస్సుల్లో ఎన్జీవో సంస్థలు, పోలీసులను భాగస్వాములను చేయాలన్నారు. లింగ నిర్ధారణకు పాల్పడుతున్న ఆస్పత్రులను తనిఖీ చేసేటప్పుడు తనను పిలవాలని సూచించారు. డివిజన్ కన్వీనర్ డాక్టర్ ఉమావతి మాట్లాడుతూ భీమిలిలో రెండు ప్రభుత్వ, ఐదు ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లు ఉన్నాయన్నారు. పురుషుల, మహిళల నిష్పత్తి 1000:942 ఉందన్నారు. ఈ అంతరాన్ని తగ్గించాలన్నారు. సమావేశంలో జిల్లా మీడియా అధికారి నాగేశ్వరరావు, రేడియాలజిస్ట్ రమేష్, చిన్నపిల్లల వైద్య నిపుణుడు తాతమ్మనాయుడు, భీమిలి ఎస్‌ఐ గంటా హరీష్, ఎన్జీవో ప్రతినిధులు అన్నే గ్రేస్, ఎస్.బేగం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథుని నేత్రోత్సవం



అలంకరణలో జగన్నాథుడు, సుభద్ర, బలభద్రుడు

భీమునిపట్నం: భీమిలిలోని పురాతన జగన్నాథస్వామి ఆలయంలో స్వామివారి కళ్యాణ రథోత్సవాల్లో భాగంగా శనివారం నేత్రోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆర్.కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం మెయిన్ రోడ్డులో రథం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత భక్తులు రథాన్ని లాగుతూ ఊరేగింపు నిర్వహిస్తారు.

పెంపుడు జంతువులతో జాగ్రత్తలు అవసరం



కుక్కలకు వ్యాక్సిన్లు వేస్తున్న డాక్టర్ వెంకటరమణ



తునివలసలో కుక్కలకు టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారి శ్రీనివాస్



మధురవాడలో కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యురాలు అనుపమ

మధురవాడ : కుక్కలను మచ్చిక చేసుకోవడంతోపాటు సంరక్షణలో కూడా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని విశాఖపట్నం పశువైద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ సూచించారు. ప్రపంచ పెంపుడు జంతువుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కలు కరిచినా, గీకినా, చొంగ తాకినా కూడా రేబిస్ సోకే ప్రమాదం ఉందన్నారు. ప్రాణాంతకమైన రేబిస్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకూదన్నారు, పెంపుడు కుక్కలకు ప్రతి ఒక్కరూ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. కుక్కల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోకపోతే కలిగే నష్టాలు వివరించారు. కార్యక్రమంలో పీఎస్‌బీఎస్ డీడీ ఎస్.కురుణాకరరావు, చంద్రంపాలెం పశు వైద్య కేంద్రం వైద్యాధికారి ఆర్.అనుపమ పాల్గొన్నారు. అనంతరం మధురవాడలోని చంద్రంపాలెం పశు వైద్య కేంద్రంలో వైద్యాధికారి ఆర్.అనుపమ ఆధ్వర్యంలో 76 పెంపుడు కుక్కలకు ఉచితంగా వ్యాక్సిన్ వేశారు.

పద్మనాభం : కుక్కలు ద్వారా సోకే వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని రెడ్డిపల్లి పశు వైద్యాధికారి ఆర్.శ్రీనివాస్ సూచించారు. కుక్కలకు రేబిస్ రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై జునోసిస్ దినోత్సవం సందర్భంగా తునివలస, కోరాడ, నేరెళ్లవలస, అయినాడ, తునివలస రైతు భరోసా కేంద్రాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కుక్కలు పుట్టిన 90 రోజులకు టీకా వేయించాలన్నారు. ప్రతి ఆరు నెలలకోసారి టీకాలు వేయించాలన్నారు. అనంతరం గ్రామంలో 50 కుక్కలకు రేబిస్ రాకుండా టీకాలు వేశారు. విజయానందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో వెటర్నరీ అసిస్టెంట్ ఎస్.సుజాత, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

142 పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్

భీమునిపట్నం : భీమిలిలోని పశువైద్యశాలలో శనివారం ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేశారు. వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటరమణ ఆధ్వర్యంలో 142 పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు కుక్కల యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాటి ఆరోగ్యం కోసం వ్యాక్సిన్లు వేయించాలని, చికిత్స, మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏదైనా సమస్య వస్తే తమను సంప్రదించాలని కోరారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



తగరపువలసలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తగరపువలస : భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు, హిందూ మహాసభ, రాష్ట్రీయ స్వయం సేవక్ సభ్యుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా శనివారం బీజేపీ నాయకులు అంబేడ్కర్ కూడలిలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పార్టీ భీమిలి కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే కలకత్తా విశ్వవిద్యాలయానికి ఉప కులపతిగా పనిచేసిన ముఖర్జీ కేంద్ర పరిశ్రమల మంత్రిగా కూడా పనిచేశారన్నారు. ఆ సమయంలోనే కాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే 370 ఆర్టికల్ రద్దు చేయాలని డిమాండ్ చేశారన్నారు. ఒక దేశానికి ఇద్దరు ప్రధానులు, రెండు జాతీయ పతాకాలు ఉండటాన్ని సహించలేదన్నారు. అందుకు నిరసనగా నిరాహార దీక్ష చేస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారని, వారి కస్టడీలోనే ప్రాణాలు వదిలారని గుర్తు చేశారు. నాయకులు అయినాడ మాధవ, పంపాన శ్రీధర్ పాల్గొన్నారు. ఆనందపురం మండలం పెద్దిపాలెంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు ఆధ్వర్యంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు.